క్లుప్తంగా

జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్‌గా డీఎం

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పాల్వంచ మేనేజర్ బి.లక్ష్మోజీ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు ఆయన స్థానంలో భద్రాచలం డీఎం సమ్మయ్య తాత్కాలిక బాధ్యతలు స్వీకరించారు.

కళాశాల సుందరీకరణకు పూలమొక్కల అందజేత


మొక్కలను అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల సుందరీకరణలో భాగంగా పాల్వంచ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి కామేశ్వరరావు శనివారం పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ... కళాశాల సుందరీకరణలో భాగంగా తన వంతు బాధ్యతగా మొక్కలను అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్పాలి


మాట్లాడుతున్న ముస్లిం పెద్దలు

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: చిన్నప్పటి నుండే పిల్లలకు నైతిక విలువలు నేర్పాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తిని ఇవ్వకున్న ఫర్వాలేదు కానీ నాణ్యమైన చదువు, సంస్కారాలు ఇవ్వాలని మౌలానా ముఫ్తీ యాకూబ్‌సాబ్ అన్నారు. శనివారం రామవరంలో జమా మసీదులో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మోద్రస్ ఇక్రా కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ... మసీదు కమిటీ పిల్లల సెలవులు సద్వినియోగం చేసుకునేలా ఈ శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, మాలానా, రఫీ, అహ్మద్ సాబ్, రబ్బానీ, జానీ, మున్వర్, రసూల్, గౌస్, హాజీ, షౌకత్, ముజాహిద్, కరీం, అఫ్జల్, అస్లం జావీద్, వజీర్, తదితరులు పాల్గొన్నారు.

బూడిద రవాణాను గిరిజనులకే ఇవ్వాలి


మాట్లాడుతున్న నరేష్ నాయక్

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్ బూడిద రవాణా తెలంగాణా హైకోర్టు తీర్పు ప్రకారం కేవలం గిరిజనులకే ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని యువతరం పార్టీ నాయకులు అజ్మీరా నరేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరకవాగు, సురారం, పునుకుల, పుల్లాయిగూడెం గ్రామాలకు చెందిన గిరిజన సొసైటీలకు మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధారావత్ రాణిక్, బలగం సురేష్, కలిందర్, చంటి, కల్యాణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై

ఇల్లెందురూరల్: గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కొమరారం ఎస్సై నాగుల్‌మీరా అన్నారు. కొమరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విత్తన, ఎరువుల విక్రయదారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, ప్రతీ రైతుకు విధిగా రశీదులు అందజేయాలని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. దుకాణాల్లో నిబంధనల ప్రకారం రిజిష్టర్లు నిర్వహించాలని, తనిఖీ సమయంలో తేడా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఇకపై క్యూఆర్‌టీసీగా..


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు (ఫైల్)

ఆర్టీసీలో 'క్యూఆర్ కోడ్' సేవలు

- అందుబాటులోకి పది యాప్‌లు
- బస్సు సర్వీసుల పూర్తి సమాచారం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

చుంచుపల్లి: క్యూఆర్ కోడ్ అంటే దాని గురించి తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదేమో. వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలు, ఇతర అంశాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇప్పుడు ఆర్టీసీ కూడా ఇదే బాటలో పయనిస్తోంది. ఇప్పటికే ప్రయాణికుల సౌకర్యార్థం పలు యాప్‌లను ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఇప్పుడు క్యూఆర్ కోడ్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం పాతదే అయినా సంస్థ దీన్ని ఆధునీకరించింది. ఫోన్‌లోని స్కానర్ సాయంతో కోడ్‌ను స్కాన్ చేస్తే పది రకాల యాప్‌లు (ఆర్టీసీ సేవలు) వినియోగించుకునేందుకు వీలవుతుంది. ఆన్‌లైన్‌లో బస్ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్, గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్, యూట్యూబ్, ఫేస్బుక్, వాట్సప్ ఛానల్‌లు ఉంటాయి. గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్‌కు ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఉపయోగపడేలా వేర్వేరు యాప్‌లు ఇక్కడ లభిస్తాయి. మొత్తంగా పది రకాల యాప్ సర్వీసులు ఒకే చోట ఉంటాయి. మెయిల్, ఐడీ, పాస్వర్డ్ సాయంతో మన వివరాలు పొందుపరిస్తే వినియోగించుకోవడం సులభమవుతుంది. సాధారణంగా ఫ్లెక్సీల రూపంలో, ఇతర విధానాల్లో ప్రచారం చేస్తే అంతగా చేరుతుందో లేదోనన్న కారణంతో ఆర్టీసీలో ఈ కీచైన్ విధానాన్ని ప్రారంభించారు. ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రజల్లోకి మరింత విస్తృతంగా చేరేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌తో ప్రయోజనం..



ఆర్టీసీలో క్యూఆర్ కోడ్‌ను ప్రవేశ పెట్టడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. నేరుగా స్కాన్ చేసి పది రకాల సేవలను పొందవచ్చు. ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ వెబ్‌సైట్, గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఇన్‌స్టాగాం, ఎక్స్, యూట్యూబ్, ఫేస్బుక్, వాట్సప్ ఛానల్‌తో ప్రయాణికులకు సౌకర్యవంతంగా మారింది. యువకులు ఎక్కువగా సద్వినియోగం చేసుకుంటున్నారు. – సాయి తేజ, కొత్తగూడెం

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఉన్నాం. కోడ్ స్కాన్ చేస్తే సంస్థకు సంబంధించిన అన్ని సేవలను ఒకే చోట పొందేలా దీనిని రూపొందించారు. ఇది మరింత చేరువయ్యేందుకు కీచైన్లు రూపొందించాం. వాటిని ప్రయాణికులకు పంపిణీ చేస్తున్నాం. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.దేవేందర్‌గౌడ్, ఆర్టీసీ డీఎం, కొత్తగూడెం

క్యూఆర్ కోడ్ సేవలు..



ఆర్టీసీ రోజురోజుకూ ఆధునికతను అందిపుచ్చుకుంటోంది. ఇప్పటికే సాంకేతికత ఆధారంగా సీట్ల రిజర్వేషన్, వివిధ సందర్భాల్లో డిజిటల్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ప్రైవేట్ బస్సుల నుంచి ఏర్పడుతున్న పోటీని తట్టుకునేందుకు కొత్త యాప్‌లను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్' అందుబాటులోకి తీసుకొచ్చింది. పది రకాల సేవలు ఒకే చోట లభించే విధంగా కోడ్ రూపొందించారు. ఒక్క కోడ్ సాయంతోనే ఈ పది రకాల సేవలు పొందొచ్చు. మనం ప్రయాణించాలిసిన బస్సు ఎక్కడుందో తెలుసుకునేందుకు దూర ప్రాంతాల నుంచి మనవాళ్లు వస్తుంటే వారు ఎక్కడి వరకు వచ్చారు.. ఎంత సమయంలో గమ్యం చేరుకుంటారులాంటి సమాచారం అంతా గమ్యం యాప్‌లో లభిస్తుంది. రాష్ట్రంలో నడుస్తున్న సంస్థ బస్సుల వివరాలు, సమాచారం అందుబాటులో ఉంటుంది. ఆన్‌లైన్‌లో మనకు కావాల్సిన చోటుకి టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. సలహాలు, సూచనలే కాదు సమస్యలు, సేవలపై ఎలాంటి ఫిర్యాదులున్నా ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్, ఎక్స్ వేదికలు ఉన్నాయి. వివాహాది శుభకార్యాలతో పాటు విహారయాత్రకు బస్సులను రాయితీ విధానంలో తక్కువ ధరకే బుకింగ్ చేసుకోవచ్చు. ప్రయాణికుల సమయం వృథా కాకుండా ఉండేందుకు సంస్థ సాంకేతికను ఉపయోగించి త్వరగా సేవలు అందేలా చేస్తుంది. డబ్బులు చెల్లింపు, ఇతర సేవలకు క్యూఆర్ కోడ్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రయాణికులకు మొబైల్ ద్వారానే మెరుగైన సేవలు అందనున్నాయి. దీంతో డబ్బులు ఇచ్చి టికెట్ తీసుకోవడం ఉండదు. అలాగే, కండక్టర్లకు చిల్లర కష్టాలు కూడా తప్పనున్నాయి.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పాల్వంచ/ పాల్వంచరూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని, సర్కారు బడిలో పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాల్వంచతోపాటు మండలపరిధిలోని రంగాపురం, జగన్నాథపురం గ్రామాల్లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆర్థికభారం లేకుండా పిల్లల భవిష్యత్‌కు భరోసానివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, ఎస్‌కె.పాషా, ఎ.విజయ భాస్కర్, ఎ.నరసింహారావు, హరిసింగ్, కృష్ణ, రహీముద్దీన్, కిషోర్, అంబ్రికా జాదవ్, ఎస్.శ్రీనివాస్, రాజులు, మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ వేడుకలు


పూజ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య దంపతులు


ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగూడెం గ్రామంలో ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో నిర్మించిన ఆలయం వద్దకు అమ్మవారి విగ్రహాన్ని గ్రామస్తులంతా హాజరై ఊరేగింపుగా తీసుకెళ్లారు. పండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చరణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ప్రతీ కుటుంబం ఇంటివద్ద సిద్ధం చేసిన బోనంతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.


కొలువుదీరిన ముత్యాలమ్మతల్లి

ఆంజనేయస్వామి విగ్రహం..

మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ బోటిగుంపు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా నూతనంగా నిర్మించిన ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య లక్ష్మి దంపతులు, ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు హాజరై పూజలు చేశారు. మాజీ సర్పంచ్ కున్సోత్ రాము, మండల రాముమహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ..

మండలంలోని కొమరారం సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ధ్వజస్తంభాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో వేదమంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో అర్చకురాలు కోరం కోటమ్మ, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన గిరిజన నృత్యాలు


కొమ్ము నృత్యాన్ని ప్రదర్శిస్తున్న ఆదివాసీ గిరిజనులు


సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానిలో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో గిరిజనులు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. గిరిజన మహిళలు బిందెమీద బిందెను నెత్తిమీద ఎత్తుకుని చేసిన నృత్యం, ఆదివాసీలు నిర్వహించిన కొమ్ము, డోలుతో కలిసి చేసిన నృత్యాలు మంత్రులను, నాయకులను అలరించాయి.

వినతుల వెల్లువ


వినతిపత్రం అందజేస్తున్న ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

పాల్వంచ: పాల్వంచ పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్కకు, ఎంపీలు బలరాంనాయక్, తెలంగాణా కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌లకు పలు సంఘాల నాయకులు శనివారం వినతి పత్రాలను అందించారు. తెలంగాణా ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఏజెన్సీ జిల్లాల్లో ఎస్టీ దమాషా ప్రకారం ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని, ఏజెన్సీ ప్రాంత గిరిజన హక్కులను ప్రభుత్వం కాపాడాలని, గిరిజన ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో వీరన్న, శోభన్, రవికుమార్ చౌహాన్, వీరు, లోకేష్, రామ్‌సింగ్, రమేష్ బాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్రంలో ఉన్న విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణా రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్(హెచ్–101) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎడెల్లి వీరేశ్ వినతి అందించారు.
- కేటీపీఎస్ గెస్ట్ హౌజ్ నందు మీనాక్షి నటరాజన్ కలిసి కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలకు తగు ప్రాధాన్యత కల్పించాలని నాయకులు వానపాకుల రాంబాబు, రఫీలు కోరారు.
- పాల్వంచ టెక్‌షోర్ ట్రెనింగ్ సెంటర్ నిర్వాహకులు క్వాలిటీ అష్యూరెన్స్ కోసం నిధులు మంజూరు చేయాలని భట్టిని కోరారు.

కార్పొరేషన్ పనులు ముమ్మరం

- మారనున్న మున్సిపాలిటీ బోర్డు
- డివిజన్ల ఏర్పాటుకు కసరత్తు..!
- అధికారులతో సమావేశం


అధికారులతో సమావేశమైన స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందేందుకు గానూ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే గెజిట్ విడుదల కావడం, జీవో రావాల్సి ఉండడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. సీడీఎంఏ నుంచి కార్పొరేషన్ కమిషనర్‌గా సుజాతను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలు, పాల్వంచ మున్సిపాలిటీకి సంబంధించిన ఆస్తులను కార్పొరేషన్‌కు బదలాయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల ప్రకారం కమిషనర్ సుజాత శుక్రవారం ఏడు పంచాయతీల్లో పర్యటించి పంచాయతీలకు సంబంధించి పేరు మార్పిడి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటుగా రికార్డులు, ఆస్తులకు సంబంధించిన నివేదికలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పాల్వంచ మున్సిపాలిటీకి సంబంధించిన రికార్డులు, ఆస్తుల నివేదికలను సైతం స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో కూడా ప్రస్తుతం అకౌంట్లు హోల్డ్‌లో పెట్టారు. ఏడు పంచాయతీలు, పాల్వంచ మున్సిపాలిటీ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు సంబంధించి పేర్లను త్వరలో మార్పిడి చేసి కొత్తగూడెం కార్పొరేషన్‌గా బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

డివిజన్లకు కసరత్తు...

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ నియామకంతో డివిజన్ల ప్రక్రియ కూడా కసరత్తు చేస్తున్నారు. జీవో విడుదలయితే పూర్తి స్థాయిలో డివిజన్ల ఏర్పాటు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం డివిజన్లకు సంబంధించిన ప్రక్రియ ఏ విధంగా చేయాలి, ఎంత మంది ఓటర్లు, జనాభా వంటి విషయాలపై డీటీసీపీవో, టీపీవో అధికారులు సంయుక్తంగా చర్చలు జరుపుతున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, ఏడు పంచాయతీలు కలిసి కార్పొరేషన్‌లో మొత్తం 60 డివిజన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ కొత్తగూడెం వచ్చిన సందర్భంగా కమిషనర్ సుజాతతో కలిసి సమావేశం నిర్వహించి, సిబ్బంది తదుపరిగా వారు అవలంభించాల్సిన విషయాలపై దిశ, నిర్దేశం చేశారు.

బదిలీలు, పదవీ విరమణలు సహజం


సింగరేణి(కొత్తగూడెం): ఎస్సై ఎస్తేరురాణిను సన్మానిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

సింగరేణి(కొత్తగూడెం): పోలీసు శాఖలో 34 ఏళ్ల నుంచి పనిచేసి పదవీ విరమణ పొందిన టూ టౌన్ ఎస్సై సెల్వరాజు, ఏఎస్సై ఎస్తేరు రాణిలను ఎస్పీ రోహిత్‌రాజు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణలు తప్పవని, ఎక్కడ పని చేసిన అంకితభావంతో పనిచేసి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చెన్నూరు శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందు: రాజమ్మను సన్మానిస్తున్న జీఎం కృష్ణయ్య

సింగరేణి ఉద్యోగికి..

ఇల్లెందు: పదవీ విరమణ పొందిన ఉద్యోగి రావుల రాజమ్మను సింగరేణి ఇల్లెందు ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గిరిధర్‌రావు, నరసింహరాజు, మోహన్‌రావు, రాంమ్మూర్తి, మధుబాబు, యూనియన్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

సీతారామ జలాలను ఇల్లెందుకు తరలించాలి


మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో బీడు భూములు సస్యశ్యామలమయ్యేలా మళ్లించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం వినతిపత్రం అందజేశారు. వర్షాధారంగా సాగు చేసుకుంటూ అరకొర పంటలతో ఇబ్బంది పడుతున్న నియోజకవర్గ రైతులను ఆదుకోవాలని మంత్రికి ఎమ్మెల్యే విన్నవించారు. గార్ల మండలంలో మున్నేరుపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌లాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే రోడ్డు చిత్తడే..


చిత్తడిగా మారిన లలితాపురం రోడ్డు

ఇల్లెందు: ఇల్లెందు– ఖమ్మం రోడ్డులో కరెంటాఫీస్ నుంచి లలితాపురం వరకు ఉన్న రోడ్డు చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. ఈ రోడ్డు నిర్మాణంలో ఉండటంతో పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు అందులో నిలుస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. నిత్యం వందల వాహనాలు ఇలాగే రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే ఈ రోడ్డులో గుంతలు పూడ్చి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ఇల్లెందు: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి సూచించారు. ఇల్లెందు కోర్టు ఆవరణలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తుల వల్లకలిగే అనార్థాలపై అవగాహన పెంచుకొని తమకు తాము దూరంగా ఉండటంతోపాటు విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, న్యాయవాదులు నారాయణ, నర్సయ్య, వినోద్, రవికుమార్‌నాయక్, సూర్నపాక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద వైద్యులు, వైద్యసిబ్బంది కలిసి ప్రతిజ్ఞ చేశారు.


ఇల్లెందు: మాట్లాడుతున్న కీర్తిచంద్రికరెడ్డి

ఈ కార్యక్రమంలో యునాని డాక్టర్ రాజేందర్, ఆయుర్వేదిక్ డాక్టర్ శ్రీదేవి, సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ రాధిక, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

టేకులపల్లి: పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ సూచించారు. మండలలలోని సులానగర్ గ్రామంలో 'పొగాకు మెరిసే ఉత్పత్తులు – చీకటి ఉద్దేశాలు' పేరుతో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు తాగడం, తినడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి నిషేధించేలా చైతన్యం కల్పించాలని కోరారు.


జూలూరుపాడులో..


టేకులపల్లిలో..

ఈ కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల వెంకటేష్, వైద్య సిబ్బంది పార్వతి, చంద్రకళ, శ్రీనివాస్, బండి వెంకటేశ్వర్లు, విజయ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.